ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వంగా గీత సవాలు

ఎర్రచందనం స్మగ్లింగ్ వెనుక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం ఉన్నట్లుగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలపై వైసీపీ నేత వంగా గీత మండిపడ్డారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డిపై పదే పదే ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నది మీరే కాబట్టి దీనిపై ఏదైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సవాలు విసిరారు.వంగా గీత శనివారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీడీపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. వైసీపీ శ్రేణులపై దాడులు చేయడం సరికాదని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా వైసీపీ పార్టీ ఆఫీసు భవనాలను కూల్చివేశారని అన్నారు. రాష్ట్రంలో నిర్మాణాలు తప్ప కూల్చివేతలు ఉండవని చంద్రబాబు చెప్పారని గుర్తుచేశారు. ముందు చంద్రబాబును ఆయన మాటపై నిలబడాలని సూచించారు. ప్రజల సంక్షేమం చూడండి.. అంతేకానీ ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు చేయకండని హితవు పలికారు.

RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిటి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక : 67 ఆదివారం 07-07-2024 పేజీలు :04 వెల:రూ.2.00

సీఎం హోదాలో తొలిసారి కలిసిన ఇద్దరు నేతలు..!

ఇరు రాష్ట్రాల నుంచి డిమాండ్లు..

హైదరాబాద్,జూలై6 ,శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రజాభవన్‌కు చేరుకున్న చంద్రబాబుకు ..తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు స్వాగతం పలికారు. ముఖ్య మంత్రులో భేటీలో ఏపీ నుంచి సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులు కందుల దుర్గేష్, సత్యప్రసాద్, బీసీ జనార్ధన్‌రెడ్డి పాల్గొన గా..తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఏపీ,తెలంగాణ సీఎస్‌లతో పాటు ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు.అనంతరం చంద్రబాబును సన్మానించి..కాళోజీ రాసిన “నా గొడవ” పుస్తకాన్ని బహూకరించారు రేవంత్‌రెడ్డి. నిజాం కాలం నుంచి 1980ల వరకూ పాలన..ఏళ్లతరబడి సాగిన తెలంగాణ ప్రజాఉద్యమాలపై ఈ పుస్తకంలో ప్రస్తావించారు ప్రజాకవి కాళోజీ. ఇక చంద్రబాబు..రేవంత్‌రెడ్డికి తిరుమల శ్రీవారి ప్రతిమతో పాటు శ్రీవారి ప్రసాదాన్ని అందించారు. ప్రజాభవన్ భేటీలో విభజన సమస్యల పరిష్కారానికి రోడ్ మ్యాప్ ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది.రాష్ట్ర ప్రయోజనాలపై రాజీపడకుండా ఉమ్మడి అజెండాపై కలిసి పని చేయాలని రెండు రాష్ట్రాలు భావిస్తున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఉమ్మడిగా ప్రయత్నించాలని , ఎగువ రాష్ట్రాలతో నీటి వాటాలపై కలిసి పోరాడేలా ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేసే అవకాశం ఉంది.ఉమ్మడి ఏపీ విభజన జరిగి పదేళ్లు పూర్తయినా కూడా.. అనేక కీలకాంశాలు ఇంకాపెండింగ్‌లో ఉండిపోయాయి. అధికారుల స్థాయిలో కొన్నిసార్లు చర్చలు జరిగినా చాలా విషయాలు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా ఉమ్మడిగా తొమ్మిది ఎజెండా అంశాలను ఖరారు చేశారు.ఈ ఎజెండాలో రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 9, 10లో పేర్కొన్న సంస్థల ఆస్తుల పంపకాలు, విభజన చట్టంలో చేర్చని సంస్థల ఆస్తుల పంపకాలు, ఏపీ ఫైనాన్షియల్ కార్పొరేషన్ అంశాలు, పెండింగ్ విద్యుత్తు బిల్లులు, విదేశీ రుణ సాయంతో నిర్మించిన ప్రాజెక్టుల ఆస్తులు-అప్పుల పంపకాలు, ఉమ్మడి సంస్థలకు చేసిన చెల్లింపులు, లేబర్ సెస్ పంపకాలు, ఉద్యోగుల విభజన అంశాలు ఉన్నాయి.

22నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

ఆగస్టు 12 వరకు బడ్జెట్ సమావేశాలు
23న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నిర్మలా సీతారామన్
వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ,జూలై6: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించి, నరేంద్రమోదీ నేతృత్వంలో మూడోసారి ఎన్డీయే కూటమి కొలువుదీరిన వేళ..ఇటీవలే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం జులై 23న బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు బడ్జెట్‌ను సమర్పించనున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల సంవత్సరం కావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 1న నిర్మలమ్మ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో పూర్తి స్థాయి బడ్జెట్‌ను తీసుకొస్తున్నారు. మోదీ 3.0లో ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్ ఇదే. దీంతో వరసగా ఏడుసార్లు బడ్జెట్ సమర్పించిన ఘనతను నిర్మలా సీతారామన్ అందుకోనున్నారు. ఇప్పటి వరకు మొరార్జీ దేశాయ్ వరసగా ఆరుసార్లు బడ్జెట్ సమర్పించారు. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామన్‌కు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళగా గుర్తింపు పొందారు. ఎప్పటిలా సూట్‌కేసులో కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు బడ్జెట్ సమర్పణ తేదీలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారంనాడు ప్రకటించారు. జూలై 22వ తేదీన బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై ఆగస్టు 12వ తేదీతో ముగుస్తాయని,బడ్జెట్ సమావేశాల రెండో రోజైన జూలై 23న కేంద్రబడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి తెలిపారు. భారత ప్రభుత్వం సిఫారసుల మేరకు పార్లమెంటుబడ్జెట్ సమావేశాలు జరిపేందుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌ను జూలై 23వతేదీన లోక్‌సకు సమర్పిస్తాం‘ అని రిజిజు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇదే కావడం విశేషం.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవాలి : మంత్రి రాంప్రసాద్ రెడ్డి

అమరావతి : ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఏపీ రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రామాపురం మండలం కొండవాండ్లపల్లి వద్ద కారు అదుపుతప్పి టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న మంత్రి సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ కడప జిల్లాకు చెందిన యువకులు అంజినాయక్ (29), షేక్ అలీమ్ (32), జితేంద్ర (22), షేక్ అఫ్రోజ్ (30) ప్రమాదంలో మరణించారని, షేక్ ఖాదర్ బాషా (20) అనే యువకుడు గాయపడ్డాడని, అతని పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ముఖ్యంగా మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్నారని , వీటిని అరికట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరుగకుండా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు దహన సంస్కరాల కోసం లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

దాడులతో హింసాకాండకు దిగడం దారుణం

రేపు మీకు కూడా ఇదే గతి పడుతుంది జాగ్రత్త
కడప రిమ్స్‌లో వైసిపి కార్యకర్తకు జగన్ పరామర్శ
టిడిపి కక్షపూరిత దాడులకు పురిగొల్పుతోందని విమర్శలు

పులివెందుల,జూలై6 : దాడుల సంప్రదాయాన్ని ఆపాలని, లేకపోతే రేపు మీకు ఇలాంటే గతి పడుతుందని వైఎస్సార్ సీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్ శనివారం కడప జిల్లా పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో కడప రిమ్స్‌కు వెళ్లి వెంపల్లిలో ప్రత్యర్థుల దాడిలో గాయపడిన వైసీపీ కార్యకర్త అజయ్‌కుమార్ రెడ్డిని వైఎస్ జగన్ పరామర్శించారు. బాధితుడికి తాము అండగా ఉంటామని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. బాధితుడి గాయాలు, మెడికల్ కండీషన్ పై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ.. ’25 ఏళ్ల యువకుడు అజయ్ కుమార్ రెడ్డిని టీడీపీ శ్రేణులు దారుణంగా కొట్టాయి. ఎందుకంటే తను వైఎస్సార్ సీపీ పార్టీకి ఓటు వేశాడని, అదే పనిగా కావాలని వాహనాల్లో వెంప్లలెకు వచ్చి అతడి బైక్ అడ్డుకుని దాడికి పాల్పడ్డారని వైఎస్ జగన్ ఆరోపించారు. పాతికేళ్ల యువకుడిపై ఎందుకంత కోపం, వైసీపీకి సంబంధించిన వ్యక్తులు కనిపిస్తే ఇలాగే దాడులు చేస్తారా అని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఇలా దాడులు చేసి అమాయకులపై నిర్దాక్షిణ్యంగా దాడులు చేసి ఆసుపత్రి పాలు చేస్తే మీకు కలిగే ప్రయోజనం ఏముంది, ఏం సాధిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్నో ఎన్నికలు జరిగాయి, కానీ పులివెందులలో తొలిసారి తమకు ఓటు వేయని వారిపై ఇలాంటి దాడులు చేయడం కరెక్ట్ కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి భయాందోళన కలిగించే చర్యలకు దిగుతున్నారు. ఇప్పుడు మీరు వేస్తున్న బీజం, చేసే పనులు రేపు పొద్దున టీడీపీ కార్యకర్తలకు చుట్టుకుంటుంది. ఇలా భయందోళన కల్పిస్తే తనకు ప్రయోజనం ఉందని భావిస్తున్నారు. కానీ చంద్రబాబు దయచేసి ఈ చెడు సంప్రదాయాన్ని తప్పకుండా ఆపేయండి. ఎప్పటికీ మీరే అధికారంలో ఉండరు. శిశుపాలుడి పాపాల్లా పెరిగిపోతున్నాయి. వీటిని గమనిస్తున్న ప్రజలు, ఇప్పుడు దెబ్బతిన్న వారు రేపు అటువైపు ఇలాంటి దాడులు చేయడానికి చంద్రబాబు బీజం వేస్తున్నారు. నాయకులుగా మేం ఇలాంటి చర్యలకు దిగకూడదు. దయచేసి వీటిని ఇక్కడితో ఆపేయాలి. లేకపోతే భవిష్యత్తులో టీడీపీ శ్రేణులపై దాడులకు ఇవి ప్రేరేపిస్తున్నాయని’ వైఎస్ జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ధ్యాహ్న భోజన పథకం సరిగ్గా అమలు కావడం లేదని వైఎస్ జగన్ ఆరోపించారు. 90 మంది చిన్నారులు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. వారికి బ్యాగులు, కిట్లు సైతం సరిగ్గా పంపిణీ చేయడం లేదని విమర్శించారు. మాకు రావాల్సిన 10 శాతం ఓట్లు మీకు ఎందుకు పడ్డాయంటే, చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలే కారణం. స్కూళ్లు ప్రారంభమయ్యాయి.

సిఎంల భేటీ ప్రత్యక్షప్రసారం

మాజీమంత్రి బొత్స డిమాండ్
ఘాటుగా కౌంటర్ ఇచ్చిన టిడిపి మంత్రులు

అమరావతి,జూలై6 : తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సమావేశానికి సంబంధించి వైసీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన ట్వీట్‌పై టీడీపీ నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పారదర్శకత కోసం, ప్రజలకు వాస్తవాలు తెలియడానికి ముఖ్యమంత్రులు సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తే బాగుంటుందంటూ బొత్స ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ట్విట్టర్(ఎ) వేదికగా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భలే జోకులేస్తున్నారు బొత్స గారు..! పారదర్శకత గురించి మీరు.. జగన్ మాట్లాడితే నవ్విపోతారు.. వద్దులెండీ..? పారదర్శకతకు పాతరేసిందే మీరు.. మీ పార్టీ. ప్రెస్ మీట్లు కూడా లైవ్ కాకుండా ఎడిట్ చేసి ఇవ్వాలని ఆదేశించే నాయకత్వంలో మీరు పని చేస్తున్నారు. దయచేసి పారదర్శకత.. వాస్తవాలు వంటి పెద్ద పెద్ద పదాలు మీరు వాడొద్దు.. ప్రజలకు అన్ని విషయాలు తెలుసు..సమావేశమయ్యాక.. అన్ని తెలుస్తాయి‘ అని అచ్చెన్నాయుడు తెలిపారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన ట్వీట్‌పై టీడీపీ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి కూడా కౌంటర్ ఇచ్చారు. పారదర్శకత కోసం, ప్రజలకు వాస్తవాలు తెలియడానికి ముఖ్యమంత్రల సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తే బాగుంటుందంటూ బొత్స ట్వీట్ చేశారు. దీనిపై అమర్నాథ్ స్పందిస్తూ.. ‘ఆవేశపడకు బొత్సా.. అక్కడ ఉంది జగన్ కాదు, చంద్రబాబు.. మీ జగన్ రాగానే, ఏ చర్చలు లేకుండా అప్పనంగా ఏపీ భవనాలు అప్పగించింది మర్చిపోలేదు.. ఢిల్లీలో ఏపీ భవన్ ఇచ్చేస్తాని చెప్పిన మాటలు మర్చిపోలేదు‘ అంటూ వ్యాఖ్యలు చేశారు. బందర్ పోర్టులో వాటా ఇస్తామని చెప్పిన విషయం మర్చిపోలేదన్నారు. తాళాలు పగలగొట్టి ఏపీ ఆయుష్ భవనాన్ని స్వాధీనం చేసుకుంటే నోరు మూసుకున్న విషయం మర్చి పోలేదన్నారు. పోలవరం నీళ్ళు కేసీఆర్ తీసుకుని వెళ్తామని చెప్పిన మాట మర్చిపోలేదని ఆయన అన్నారు. పోలవరం ఎత్తు తగ్గించమని జగన్‌కు చెప్పానని కేసీఆర్ చెప్పింది మర్చిపోలేదన్నారు. కేసీఆర్ కాళ్ళ మీద విజయసాయి రెడ్డి పడిన విషయం మర్చిపోలేదని విమర్శించారు. చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏపీ ప్రయోజనాల కోసమే పని చేస్తారని స్పష్టం చేశారు. సీనియర్ నేతగా రెండు తెలుగు రాష్ట్రాల బాగు కోసమే పని చేస్తారన్నారు.

చంద్రబాబు, తదితరుల కేసులు సిబిఐకి అప్పగించాలని పిల్

దాఖలు చేసిన స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కొట్టి బాలగంగాధర్ తిలక్
నిష్పాక్షిక, పారదర్శకమైన దర్యాప్తు కోసం కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలంటూ పిటిషన్

నేలపాడు(అమరావతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సహా పలువురు తెలుగు దేశం పార్టీ నేతలు, వ్యాపారవేత్తలపై ఉన్న కేసులన్నీ సిబిఐ, ఈడిలకు అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కొట్టి బాలగంగాధర్ తిలక్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, పొంగూరు నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, వ్యాపారవేత్తలు లింగమనేని రమేశ్, వేమూరు హరికృష్ణ సహా మొత్తం 114 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తాను వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా పేర్కొన్నారు.స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం, మద్యం కుంభకోణం, ఏపి ఫైబర్ నెట్ కుంభకోణం, అసైన్డ్ భూముల కుంభకోణం, ఇసుక కుంభకోణం, ఇన్నర్ రింగు రోడ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు తదితర స్కామ్‌లకు సంబంధించి దర్యాప్తు బాధ్యతలను సిబిఐ, ఈడిలకు అప్పగించాల్సిన అవసరం ఉందన్నారు. నిష్పాక్షిక, పారదర్శక, వేగవంతమైన దర్యాప్తు కోసం కేసులను సిబిఐ, ఈడికి అప్పగించాలని అభిప్రాయపడ్డారు.ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచీ డిజిపి, సిఐడి అదనపు డిజి తదితరులందరూ కూడా ఈ కేసుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తిలక్ వివరించారు.

సంపాదకీయం

ఆదివారం 07-07-2024

భారత్ లో పేదరికం తగ్గిందా....

దేశ వ్యాప్తంగా పేదరికం భారీగా తగ్గుముఖం పట్టింది. 2011-2012లో, దేశం మొత్తం జనాభాలో 21 శాతం మంది పేదరికంలో ఉన్నారు. కానీ ఇప్పుడు పేదరికం శాతం 8.5కి పడిపోయిందని అధ్యయన నివేదిక వివరించింది. ఈ గణాంకాలు భారత మానవ వనరుల అభివృద్ధి సర్వేలో వెల్లడయ్యాయి.ద్రవ్యోల్బణం సహా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని 'టెండుల్కర్ కమిటీ సూత్రాల' ఆధారంగా దారిద్ర్యరేఖను నిర్ణయించినట్లు నివేదిక వివరించింది. ఈ నివేదిక పేదరికంపై భారత ప్రభుత్వ విధానాన్ని రూపొందించడంలో, అమలు చేయడంలో గణనీయమైన కృషి చేస్తుంది. 2017లో ప్రపంచ సంస్థ అంతర్జాతీయ దారిద్ర్య రేఖను కొనుగోలు శక్తి ప్రమాణాల ఆధారంగా వి2.15కి పరిమితం చేసింది.థింక్ ట్యాంక్ ఎన్‌సీఏఈఆర్ (ఔఅంఇఖీ' హెడ్, ఫైనాన్స్ నిపుణుడు సోనాల్దే దేశాయ్ నేతృత్వంలోని బృందం ఈ అధ్యయనం కోసం నివేదికను సిద్ధం చేసింది. భారతదేశంలోని చాలా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం గణనీయంగా తగ్గిందని నివేదిక పేర్కొంది. 2004-2005లో 38.6 శాతం ఉన్న పేదరికం 2011-12 నాటికి 21.2 శాతానికి తగ్గింది. కోవిడ్ మహమ్మారి సవాలు విసిరినప్పటికీ 2022-2024లో ఇది 8.5 శాతానికి తగ్గుతుంది. ఆర్థిక వృద్ధి, పేదరికం తగ్గింపు వేగవంతమైన సామాజిక రక్షణ కార్యక్రమాలు అవసరమయ్యే వాతావరణాన్ని సృష్టిస్తాయి.ఆర్థిక వృద్ధి యుగంలో అవకాశాలు పెరిగే కొద్దీ దీర్ఘకాలిక పేదరికం తగ్గవచ్చు. పేదరికంలో మగ్గుతున్న ప్రజల ఆర్థిక పురోభివృద్ధికి ఇది యంత్రాంగాన్ని అమలు చేస్తోంది. ఫలితంగా పేదరికం గణనీయంగా తగ్గింది. ఈ మేరకు నివేదికలో పేర్కొంది.2011-12లో గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం రేటు శాతం 24.8గా ఉండేది. ఇప్పుడు అది 8.6కి పడిపోయింది. పట్టణ ప్రాంతాల్లో పేదరికం రేటు శాతం 13.4గా ఉంది. ఇప్పుడు 8.4కి పడిపోయిందిఎస్‌బీఐ ఇటీవల నిర్వహించిన సర్వేతో పోలిస్తే ఈ సర్వే గణాంకాల్లో స్వల్ప పెరుగుదల కనిపించింది. గృహ వినియోగ వ్యయ సర్వే ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం శాతం 7.2 శాతం, పట్టణ ప్రాంతాల్లో ఇది ఒక శాతం. 4.6 శాతంగా ఉందని ఎస్‌బీఐ సర్వే పేర్కొంది.గత మార్చిలో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రంగరాజన్, ఆర్థికవేత్త ఎస్ మహేంద్ర దేవ్ 2022-23లో భారతదేశ పేదరికం రేటు. 10.8కి పడిపోయిందని తెలిపారు. నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భారతదేశం పేదరికం స్థాయి 5లోపే ఉందని తెలిపారు.ప్రభుత్వం ఆహార ధాన్యం పంపిణీకి పెద్దపీట వేస్తోంది. దీంతో పాటు రేషన్ పంపిణీ వ్యవస్థ కూడా మెరుగుపడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కింద ప్రజలు అనేక ప్రయోజనాలు పొందుతున్నందున పేదరికం గణనీయంగా మెరుగుపడింది.ఇప్పుడు దేశ పేదరిక నిర్మూలన మరో స్థాయికి చేరుకోవాల్సిన అవసరం ఉందని నివేదిక సూచిస్తోంది. సామాజిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వ విధానాలు ముందుకు సాగాలి. వ్యాధులు, వివాహాలు, ప్రకృతి వైపరీత్యాల నిర్వహణపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. ఇవే ప్రజలను పేదరికం వైపు నెడుతున్నాయి.మరో వైపు ళ్లుగా సేవాభావంతో ఎన్డీఏ ప్రభుత్వం ముందుకెళ్తోందని ప్రధాని మోడీ అన్నారు. ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు చూపిన విశ్వాసం పట్ల గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. దేశానికి సేవ చేసేవారినే ప్రజలు ఆశీర్వదించారని పునరుద్ఘాటించారు. ఎన్డీఏ పాలనను దేశ ప్రజలు మరోసారి సమర్థించారని పేర్కొన్నారు. రాజ్యాంగం ఆర్టికల్స్ అనుసరించేందుకే పరిమితం కాదని.. రాజ్యాంగం లైట్ హౌస్‌లా మార్గనిర్దేశం చేస్తుందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ భావనను విద్యా సంస్థల్లో విద్యార్థులకు చేరవేస్తున్నామని తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతోందన్న ప్రధాని.. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్త ఉత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.పంచ వ్యాప్తంగా చూస్తే.. 2016 ఆరంభంలో 72.5 కోట్ల మంది నిరుపేదలుగా ఉన్నారు. ప్రస్తుతం 64.34 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారు. ఇది మొత్తం ప్రపంచ జనాభాలో 8 శాతం.దారిద్ర్య నిర్మూలన లక్ష్యాన్ని నిర్దేశించిన 2016 జనవరి 1వ తేదీ నుంచి 2018 జూలై మధ్య.. ప్రపంచంలో 8.3 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారు.2030 నాటికి దారిద్ర్యాన్ని పూర్తిగా నిర్మూలించాలంటే ఇప్పటికే 12 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడి ఉండాల్సింది.2016 ఆరంభంలో ఉన్న 72.5 కోట్ల మంది పేదలను "దారిద్ర్యం నుంచి విముక్తి కల్పించడానికి సెకనుకు 1.5 మందిని చొప్పున పేదరికం నుంచి బయటపడేయాల్సి ఉంది. కానీ.. 1.1 మందిని మాత్రమే పేదరికం నుంచి బయటకు రప్పించగలుగుతున్నాం. ఈ వేగం మరింత నెమ్మదిస్తున్నట్లు అవగతమవుతోంది. 2020 నాటికి సెకనుకు 0.9 మందికి, 2022 నాటికి 0.5 మందికి తగ్గిపోతుందని తీరుతెన్నులు చెప్తున్నాయి" అని బ్రూకింగ్స్ వివరించింది.కొనసాగితే.. 2030 నాటికి లక్ష్యం చేరుకోవటం సాధ్యం కాదని.. ఇంకా 47.17 కోట్ల మంది (అప్పటి జనాభాలో 6 శాతం) పేదరికంలోనే ఉంటారని పేదరిక గడియారం చెప్తోంది.

టార్గెట్ ద్వారంపూడి...కథ ముగిసినట్టేనా

కాకినాడ, జూలై 6, కాకినాడ జిల్లాల్లో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తల నోట ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేరే వినబడుతుంది. గత ప్రభుత్వం హయాంలో ఆయన డైరెక్షన్ లో జరిగిన వ్యవహారాలన్నింటిపై ఫోకస్ పెట్టేస్తున్నారు. ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పవన్‌కు చేతనైతే కాకినాడ సిటీలో పోటీ చేయాలని సవాల్ విసిరారు. అంతే కాకుండా పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగతంగా విమర్శలు చేశారు. జనసేనకు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మధ్య వైరం పెరిగింది. పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి నివాసం ఎదుట ఆందోళనకు యత్నించిన జనసేన పార్టీ కార్యకర్తలు, వీర మహిళలపై ఆయన అనుచరులు దాడి చేశారు. దీంతో అప్పట్లో పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. వివిధ సభల్లో ద్వారంపూడిపై జనసేనాని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చీడపురుగు మదమెక్కి మాటలాడుతోందంటూ తీవ్ర పదజాలంతో మండిపడ్డారు. దీనికి ద్వారంపూడి కూడా స్పందించి? అదే రీతిలో కౌంటర్ ఇచ్చేవారు. ఇలా ఎన్నికల వరకు ఈ తంతు కొనసాగింది.అలాగే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కాకినాడ పోర్టును అడ్డా పెట్టుకొని ఆఫ్రికా దేశాలకు అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వినిపించాయి. కాకినాడలో ఆయన అనుచరుల రౌడీయిజం, కబ్జాలు వంటి ఆరోపణలు అనేకం ఉన్నాయి. జిల్లాల్లో మొత్తం ఆయన పెత్తనమే ఉండేది. కలెక్టర్, ఎస్పీ నుంచి అందరు అధికారులు ఆయన చెప్పుచేతుల్లోనే ఉండేవారన్న టాక్ ఉండేది.తుని ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పటికీ కాకినాడలో జరిగిన వ్యవహారాల్లో తలదూర్చేవారు కాదు. అందుకు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డే కారణంగా చెబుతుంటారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కూరసాల కన్నబాబు మంత్రిగా ఉండి, కాకినాడ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించారు. ఆయన జోక్యాన్ని చంద్రశేఖర్ రెడ్డి అడ్డుకున్నారు. దీంతో వారిద్దరి మధ్య కూడా కొంత కాలం జగడం నడిచింది. మళ్లీ జగన్మోహన్ రెడ్డి జోక్యంతో అది సమిసిపోయింది.ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి తండ్రి బాస్కర్ రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్‌గానూ, తమ్ముడు వీరభద్రరెడ్డి రాష్ట్ర రైసు మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. దీంతో అక్రమ బియ్యం తరలింపు చంద్రశేఖర్ రెడ్డి సులువుగా చేశారని ఆరోపణలు ఉన్నాయి.ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం భారీ మెజార్టీతో గెలిచింది. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఓటమి చెందారు. దీంతో ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి లెక్కలు తీసే పని షురూ అయిందన్న టాక్ వినిపిస్తోంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు తీసుకున్న తరువాత తొలి పర్యటన కాకినాడలోనే చేశారు. మూడు రోజుల పాటు ఆయన కాకినాడ సిటీ, పిఠాపురంలోనే పర్యటించారు. చంద్రశేఖర్ రెడ్డి చిట్టా మొత్తం తీశారు.అలాగే రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా తొలి పర్యటన కాకినాడలోనే చేశారు. అంతకు ముందు కృష్ణా జిల్లాలో అడపదడపా చేసినా? రెండు రోజుల పాటు సుదీర్ఘంగా పర్యటించింది మాత్రం కాకినాడలోనే..! నాదెండ్ల మనోహర్ రెండు రోజుల పాటు కాకినాడ సిటీలో పర్యటించి ద్వారంపూడి చంద్రశేఖర్ లెక్కలతో పాటు మరికొన్ని అంశాలపై ఆరా తీశారు. దీంతో ద్వారంపూడే వ్యవహారాలను బయటికి తీయటంతో పాటు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి లెక్కలను బయటికి తీయటమే టార్గెట్ అని స్పష్టం అయింది.తన పర్యటనలో భాగంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ?. పేదలకు అందాల్సిన బియ్యం విదేశాలకు తరలించారని వ్యాఖ్యానించారు. కాకినాడలో విశ్వప్రియ ఎక్స్‌పోర్ట్స్ గోడన్‌లో అక్రమంగా నిల్వ చేసిన 4,700 టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేయించారు. దీంతో ద్వారంపూడిని జైలుకు పంపే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని జిల్లాలో చర్చ జరుగుతుంది. జనసైనికులు సోషల్ మీడియాలో పవన్ కళ్యాణ్ అన్న మాట నిలబెట్టుకున్నారని తెగ పోస్టులు పెడుతున్నారు. మొత్తంగా ఎన్నికల తర్వాత కూడా కాకినాడ రాజకీయాలు ఉత్కంఠగా సాగుతున్నాయి?!

జగనా... ఇది తగునా

నెల్లూరు, జూలై 6, ఏపీ మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి తీరులో ఎలాంటి మార్పు కనిపించలేదు. తాననుకున్నదే నిజమనే భావనతోనే ఆయన కొనసాగుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారి ప్రజల్లోకి వచ్చిన జగన్ నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిని పరామర్శించారు. దాదాపు అరగంట పాటు ములాఖత్‌లో పిన్నెల్లితో మాట్లాడారు. ఆ తర్వాత బయటకు వచ్చి మీడియా ముందు తన ఆవేశం, అక్రోశాన్ని ప్రదర్శించారు.ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని, అందుకు మూల్యం చెల్లించుకుంటారని తీవ్ర స్థాయిలో జగన్ హెచ్చరించారు. జగన్ రాజకీయంగా చేసిన విమర్శలు, వాదనల మాటెలా ఉన్నా ఆయన తీరులో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. తాను ఎవరి ప్రశ్నలకు జవాబు ఇవ్వాల్సిన అవసరం లేదనే ధోరణితోనే నెల్లూరు పర్యటన సాగింది.నెల్లూరు సెంట్రల్ జైలు వద్ద మీడియాతో మాట్లాడే క్రమంలో జగన్మోహన్ రెడ్డి కాగితాలు చూడకుండానే, తడబడకుండా తాను చెప్పాలనుకున్నది చెప్పారు. దాదాపు 15-20 నిమిషాల పాటు తన మనసులో ఉన్న భావాలను వ్యక్తం చేశారు. కానీ గత ఐదేళ్లలో ఏనాడు కాగితం లేకుండా మాట్లాడే సాహసం కూడా జగన్ చేయలేదు. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ఢిల్లీ పర్యటనలో ఓసారి, కోవిడ్ సమయంలో రెండు సార్లు మాత్రమే జగన్ అధికారంలో ఉండగా మీడియాతో నేరుగా మాట్లాడారు. మిగిలిన ప్రతి సారి కాగితాలు చూసి చదవడమో, ఎడిటింగ్ చేసిన వీడియోలను రిలీజ్ చేయడానికో పరిమితం అయ్యారు.ఐదేళ్లలో జనంతో పూర్తిగా సంబంధాలను కట్ చేసుకుని పాలన సాగించడమే జగన్ ఓటమి కారణమైంది. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా జగన్‌ను కలిసేందుకు అభిమానులు, నాయకులు, పార్టీ వర్గాలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తాడేపల్లి, పులివెందుల, బెంగుళూరులో పెద్ద ఎత్తున అ?భిమానులు కలిసేందుకు వెళ్లినా ఎవరికి ముఖం కూడా చూపలేదు. బెంగుళూరు నుంచి తిరుగు ప్రయాణానికి ముందు స్వయంగా జగన్ చెప్పడంతోనే సందర్శకుల్ని అనుమతించినట్టు తెలుస్తోంది. ప్రశ్నలకు జవాబు చెప్పడం, ప్రశ్నను ఆహ్వానించడం అనేవి జగన్ పెద్దగా ఇష్టపడరు.రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్ల నుంచి అదే ధోరణి జగన్‌లో ఉంది. మొదట్లో మీడియా తనకు వ్యతిరేకం కాబట్టి వారితో మాట్లాడాల్సిన అవసరం తనకు లేదని భావిస్తున్నట్టు సన్నిహితులు చెప్పవారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రతిపక్షంలో ఉన్నపుడు,గత ఐదేళ్లలో కూడా ఇదే తీరుతో జగన్ వ్యవహరించారు. ఆయన చెప్పేది అంతా వినాలని భావిస్తారే తప్ప జనం ఏమనుకుంటున్నారో, జనం చెప్పేది వినాలని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు.తనకు తానుగా ప్రజల నుంచి పూర్తిగా దూరం జరిగిపోయారు. తాడేపల్లి నివాసంలో స్వీయ నిర్బంధం విధించుకుని అంతా అద్భుతంగా జరిగిపోతుందనే భావనలో ఐదేళ్లు గడిపేశారు. జనానికి తాను పూర్తిగా మేలు చేశానని చెప్పుకున్నారే తప్ప, జనం పడుతున్న ఇబ్బందులు, లోపాలను గుర్తించే ప్రయత్నం చేయలేదు. ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలు బ్రహ్మాండంగా పనిచేస్తాయి, ప్రజలకు మరేమి అవసరం లేదనే ధోరణితో జగన్ సాగారు. ఆయన చుట్టూ ఉన్న సలహాదారులు సైతం జగన్ మనసెరిగి ప్రవర్తించారు. తనకు నచ్చని విషయాన్ని స్వీకరించే అలవాటు జగన్‌కు లేదని తెలుసుకుని లౌక్యం ప్రదర్శించారు.వైనాట్ 175 అంటూ అంతులేని ఉత్సాహంతో ఎన్నికలకు వెళ్లి బోల్తా పడిన తర్వాత కూడా జరిగిన తప్పుల్ని జగన్ గుర్తించలేక పోతున్నారు.ప్రభుత్వ డబ్బులతో సర్వేలు, నివేదికల పేరిట కోట్లాది రుపాయల సొమ్ము చేసుకున్న వాళ్లు ఎవరు ఇప్పుడు తాడేపల్లిలో కనిపించడం లేదు. ఇంకా జగన్ తన పక్కన ఏ దారి లేక మిగిలిన భజన బృందం మాటల్ని గుడ్డిగా నమ్మేస్తూ జనంలోకి వచ్చి అసందర్భంగా మాట్లాడేస్తున్నారు.పోలింగ్ కేంద్రంలో ఈవిఎంలను పగులగొట్టడం తప్పే కాదని, పిన్నెల్లి మంచి వాడంటూ కితాబివ్వడం ప్రజలకు ఎలాంటి సందేశాన్నిస్తాయని ఆలోచించు కోలేదు. అదే సమయంలో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేలా తనను తాను సరిదిద్దు కోగలిగితేనే రాజకీయంగా జరిగిన నష్టం తగ్గుతుంది.

ఇసుక ఫ్రీ అయితే... కానీ కండిషన్స్ పై క్లారిటీ

విజయవాడ, జూలై 6, ఏపీలో ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూలై 8నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక అందుబాటులోకి రానుంది. అయితే ఇసుకను ప్రజలు ఎలా పొందాలనే దానిపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు.ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక ధరలు చుక్కలనంటుతున్నాయి. యూనిట్ లేదా టన్ను ధర గరిష్టంగా రూ.10వేలు పలుకుతోంది. ధర చెల్లించడానికి సిద్ధమైనా గత నెల రోజులుగా మార్కెట్లో ఇసుక దొరకడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందించాలనే నిర్ణయం తీపికబురే అయినా దాని ఫలితాలు ప్రజలకు ఏ మేరకు అందుతాయనేదే ప్రశ్నార్థకం. రాష్ట్ర వ్యాప్తంగా 40లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉంది. ప్రధానంగా కృష్ణా, గోదావరి, పెన్నా నది పరివాహక ప్రాంతాల్లోని ఇసుకే రాష్ట్రంలో నిర్మాణ రంగానికి ఆధారంగా ఉంటోంది. గత ఐదేళ్లలో ఇసుక ధరలు అమాంతం పెరిగిపోయాయి. రిటైల్ మార్కెట్లో లెక్కిస్తే ఇదంతా వేల కోట్ల కుంభకోణంగా మారింది. దశల వారీగా చేతులు మారుతూ వినియోగదారుడికి వచ్చేసరికి భారీగా చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రస్తుతం ఇసుక రెండు రకాలుగా ప్రజలకు చేరుతోంది. నదీ తీరాలు, డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను తవ్వి రీచ్‌ల నుంచి నేరుగా స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీటి ప్రవాహం లేనపుడు నేరుగా తవ్వుకుని అమ్మేస్తున్నారు. గత ఐదేళ్లలో టన్నుకు రూ.475 చొప్పున ఇసుకను విక్రయించారు. ఇప్పుడు ఇసుక ఉచితం అంటున్నా దాని ప్రయోజనాలు ప్రజలకు ఏ మేరకు అందుతాయనే సందేహాలు ఉన్నాయి.

ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్ల నుంచి కస్టమర్‌కు చేరేలోపు దాని ధర విపరీతంగా పెంచేస్తున్నారు. పట్టణాలు, కార్పొరేషన్లకు దూరంగా ఇసుక రీచ్‌లు ఉండటంతో ఇసుక విక్రేతలు చెప్పిన ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం విజయవాడలో టన్ను ధర రిటైల్ మార్కెట్‌లో రూ.9-10వేలు పలుకుతోంది. ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందించినా దాని ధర రూ.3-4వేలకు తగ్గించకూడదని సిండికేట్లు భావిస్తున్నాయి. రవాణా, డీజిల్, డ్రైవర్ జీతాలు, వాహనం తరుగుదల ఇలా రకరకాల లెక్కలు వేసి ఇసుక అమ్మకాల్లో కనీస లాభం ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.సామాన్య ప్రజలు, భవన నిర్మాణదారులు నేరుగా ఇసుకను తవ్వుకుని, నిర్మాణాలు జరిగే ప్రాంతానికి తరలించుకునే అవకాశం ఉండదు. దానికి మరొకరి మీద ఆధార పడాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఇసుకను కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తామని చెబుతున్నాఅది ఏ మేరకు ఫలితాలను ఇస్తుందనేది ప్రశ్నార్థకమే. ఇసుకను ప్రభుత్వం ఉచితంగా ఇచ్చినా ఏదో రూపంలో దాని మీద సంపాదించేందుకు ఇప్పటికే దళారుల ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఇలా చేస్తే మేలు?

ప్రస్తుతం ఇసుక విక్రయాల్లో ఉన్న లోపాలను సవరించాలి. ఉచిత ఇసుక ఇవ్వడం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు నేరుగా ప్రజలకే అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆన్‌లైన్‌లో విక్రయించే ఇసుకను నేరుగా ఎవరైనా ఆంక్షలు లేకుండా బుక్ చేసుకునే సదుపాయం కల్పించాలి.

రవాణా ఛార్జీలను ప్రభుత్వమే నిర్ణయించాలి. స్టాక్ పాయింట్ లేదా రీచ్ నుంచి ఎంత దూరానికి ఎంత చెల్లించాలనే ధరను పట్టణాలు, మునిసిపాలిటీలు, సెమీ అర్బన్, రూరల్ ప్రాంతాల వారీగా ధరలను నిర్ణయించాలి.

ఇసుక బుక్ చేసుకున్న తర్వాత గరిష్టంగా 24 గంటల్లోగా డెలివరీ జరిగేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

ఇసుక తరలింపులో దళారుల ప్రమేయాన్ని పూర్తిగా నియంత్రించాలి.

ఇసుకను అధిక ధరలకు విక్రయించినా, అక్రమంగా నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు, జరిమానాలు విధించడంతో పాటు వాటిని సక్రమంగా పాటించాలి.

పట్టణాలు, కార్పొరేషన్లకు సమీపంలో ఉండే ప్రభుత్వ స్థలాల్లో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయడం ద్వారా రవాణా భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

ఆన్‌లైన్‌లో ఇసుకను పొందే వ్యవస్థ మీద పక్కాగా నిఘా ఉంచాలి. ఎవరైనా స్వేచ్ఛగా ఇసుకను పొందే అవకాశం కల్పిస్తూనే దానిని దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారనే నిబంధనను బుకింగ్ సమయంలోనే స్పష్టం చేయాలి.

స్టాక్ పాయింట్లలో గుత్తాధిపత్యం లేకుండా బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో నడిపే ప్రీపెయిడ్ ఆటో వ్యవస్థల తరహాలో టోకెన్ డెలివరీ మెకానిజం ఏర్పాటు చేయాలి.

దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలను నిర్ణయించే అధికారం ప్రభుత్వమే తీసుకోవాలి.

9,16 బ్రేక్ దర్శనాలు రద్దు...

తిరుమల, జూలై 6,: శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం కీలక అప్డేట్ ఇచ్చింది. శ్రీవారి ఆలయంలో జూలై 16న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో జూలై 9వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఉంటుందని ప్రకటించింది. దీంతో జూలై 9, 16వ తేదీల్లో తిరుమలలో బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ వెల్లడించింది.తాజా నిర్ణయం కారణంగా జూలై 8, 15వ తేదీల్లో ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించబడవని టీటీడీ స్పష్టం చేసింది. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఓ ప్రకటనలో కోరింది.సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహిస్తుంటారు. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే తిరుమంజనం కార్యక్రమం సుమారు 5 గంటలపాటు కొనసాగుతుందని టీటీడీ తెలిపింది. తిరుమంజనం కార్యక్రమం అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ఆగమోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు.అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. తిరుమంజనం కారణంగా మంగళవారంనాడు నిర్వహించే అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.తిరుపతిలోని శ్రీ కోదండరామాలయంలో జులై నెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. జులై 13, 20, 27వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణుల మూలవర్ల అభిషేకం, సాయంత్రం 5 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహిస్తారు.జులై 16న ఆణివార ఆస్థానం ఉంటుంది. జులై 30 నుండి ఆగస్టు 2వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగ?తాయని తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది.శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వం స్వామివారి ఆలయంలో జూలై 10 నుండి 12వ తేదీ వరకు సాక్షాత్కార వైభవోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది.ఈ సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 6.30 నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు.ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతించారు.సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు.

చిత్తూరు..ప్లేట్ ఫిరాయించేశారు

తిరుపతి, జూలై 6 చిత్తూరు జిల్లాలో వైసీపీకి షాక్ ల మీద షాక్ లు తగులుతున్నాయి. పుంగనూరు మున్సిపల్ చైర్మన్ తో పాటు పాలకవర్గ సభ్యులంతా టిడిపిలో చేరేందుకు సిద్ధపడిన సంగతి తెలిసిందే. తాజాగా చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ తో పాటు డిప్యూటీ మేయర్, ఇతర కార్పొరేటర్లు టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధమైంది. వారంతా మూకుమ్మడిగా తెలుగుదేశం పార్టీలోకి వచ్చేందుకు సిద్ధపడటం విశేషం. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా చిత్తూరులో మెజారిటీ కార్పొరేషన్ లో అప్పటి అధికార వైసిపి ఏకగ్రీవాలు చేసుకుంది. ఏకపక్ష విజయాలను సొంతం చేసుకుంది. కానీ ఇప్పుడు సీన్ మారింది. టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో.. చిత్తూరు కార్పొరేషన్ కార్యవర్గమంతా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధపడటం విశేషం.చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ రెడ్డి తో సహా పలువురు కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. స్థానిక టిడిపి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో చాలామంది కార్పొరేటర్లు టిడిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. దీంతో వైసిపి పాలకవర్గం పదవి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమితో చిత్తూరు జిల్లాలో ఆ పార్టీ కకావికలమవుతోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ప్రతినిధులు పక్క చూపులు చూస్తున్నారు. ఫ్యాన్ పార్టీలో కొనసాగితే పొలిటికల్ ఫ్యూచర్ ఉండదని భావిస్తున్న చాలామంది ప్రతినిధులు పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నారు. అయితే అధికార టిడిపి నుంచి అంతగా సానుకూలత రావడం లేదు. అయితే చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు నుంచే వైసీపీకి షాక్ ఇవ్వమని భావిస్తున్నారు. తొలుత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు మున్సిపాలిటీ కైవసం చేసుకోవాలని వ్యూహం పన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేలు...ఫిరాయింపులా

నెల్లూరు, జూలై 6, పార్టీ నుంచి వెళ్లేవాళ్లు వెళ్తారు.. ఉండేవాళ్లు ఉంటారు. నైతికత ఉన్న వాళ్లు నాతోనే ఉంటారు " అని వైసీపీ అధినేత జగన్ తనతో సమవేశం అయిన నేతలతో వ్యాఖ్యానించినట్లుగా పార్టీ వర్గాలు ప్రకటించాయి. హఠాత్తుగా జగన్ ఇలా ఎందుకు చెప్పాల్సి వచ్చిందన్నది హాట్ టాపిక్ గా మారింది. పార్టీ నేతలు ఇప్పటి వరకూ పార్టీ మారుతారని ఎలాంటి సంకేతాలు రాలేదు. ఫలానా పార్టీతో చర్చలు జరుపుతున్నారని ఇంకా చెప్పుకోవడం లేదు. ఇలాంటి సమయంలో హఠాత్తుగా జగన్ పార్టీ నుంచి ఫిరాయింపుల గురించి చెప్పడం.. పోయేవాళ్లను బుజ్జగించడం.. ఆపే ప్రయత్నం చేయడం లాంటివి చేయనని చెప్పడం ఆశ్చర్యకరమే. అంతర్గతంగా ఏదో జరుగుతోందన్న అభిప్రాయం బయట ఉన్న వారికి కలుగుతోంది. ప్రభుత్వం మారినప్పుడల్లా అధికార పార్టీలోకి వలసలు సహజంగానే జరుగుతూ ఉంటాయి. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నామని వాదించే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా తెలంగాణలో అదే జరిగింది. గతంలో వైసీపీ హయాంలో నలుగురు ఎమ్మెల్యేలు అదే సిద్ధాంతాన్ని చెప్పారు. అంతకు ముందు వైసీపీ నుంచి టీడీపీలోకి ఏకంగా 23 మంది ఎమ్మెల్యేలు చేరారు. వారు కూడా అదే చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం టీడీపీలో చేరామని చెప్పారు. ఎవరూ అధికార పక్షం నుంచి విపక్షంలో చేరరు. విపక్షం నుంచి అధికార పార్టీలో చేరుతారు. ఇప్పుడు టీడీపీ కూటమి ఏపీలో అధికారంలోకి వచ్చింది కాబట్టి ఆ కూటమి పార్టీల్లోకి సహజంగానే వలసలు ఉంటాయి. అయితే చేర్చుకునేంత భారీ సంఖ్యలో వైసీపీ ఎమ్మెల్యేలు గెలవలేదు. మారాలంటే ఎమ్మెల్సీలు.. ఓడిపోయిన ఇతర సీనియర్లే ఉంటారు. మరి వీరిలో ఎవరు పార్టీ మారబోతున్నారు.. ఏ పార్టీలో చేరబోతున్నారన్నది ఆసక్తికరం. తెలుగుదేశం పార్టీ ఇప్పుడు వైసీపీ నుంచి గెలిచిన పదకొండు మంది ఎమ్మెల్యేల్లో ఎవరైనా వచ్చి చేరుతామన్నా చేర్చుకునే పరిస్థితుల్లో లేదు. కానీ ఎమ్మెల్సీల విషయంలో మాత్రం ప్రత్యేక వ్యూహం అమలు చేయాల్సి ఉంది. శాసనమండలిలో ప్రస్తుతం వైసీపీకి మెజార్టీ ఉంది. ఏ బిల్లును అడ్డుకోగల శక్తి ఉంది. అయితే ఈ అడ్డుకోవడం అనేది పూర్తి స్థాయిలో సాధ్యం కాదు. ఒకటి, రెండు ప్రయత్నాల వరకే సాధ్యం. అయినా సరే టీడీపీకి ఇబ్బందులు

వస్తాయి. మండలి చైర్మన్ కూడా వైసీపీకి చెందిన నేతే. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లు వస్తే అడ్డుకుంటామని వైసీపీ హైకమాండ్ సంకేతాలు ఇచ్చింది. అదే సమయంలో చాలా కీలకమైన బిల్లులు ఆమోదించేందుకు ఏపీ ప్రభుత్వం రెడీ అవుతోందని చెబుతున్నారు. అందుకే ఎమ్మెల్సీలను టీడీపీలో చేర్చుకోవాలన్న ఆలోచలో ఉన్నట్లుగా చెబుతున్నారు. ఒకరిద్దరికి కాకుండా మూడింట రెండు వంతుల మందిని విలీనం చేసుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇప్పిటకే ఈ అంశంపై సంప్రదింపులు జరుగుతున్నాయని ఈ విషయం తెలిసే జగన్మోహన్ రెడ్డి ఉంటే ఉంటారు పోతే పోతారని వ్యాఖ్యానించినట్లుగా చెబుతున్నారు. ఎమ్మెల్సీలు నేరుగా ఎన్నికైన వారు కాదు. వివిధ కోటాల్లో ఎన్నికయిన వాళ్లు. వచ్చే ఐదేళ్ల కాలంలో వైసీపీ తరపున ఒక్కరంటే ఒక్కరికీ కూడా ఎమ్మెల్సీ పదవులు దక్కే అవకాశం లేదు. నేరుగా ఎన్నికలు జరిగేది గ్రాడ్యుయేట్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీలకే. ఎమ్మెల్యే, గవర్నర్ కోటాల్లో వచ్చేవన్నీ టీడీపీకే వస్తాయి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీలు కూడా విపక్షంలో ఉన్న పార్టీ గెలుచుకోవడం అంత తేలిక కాదు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంటేనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు గెలుచుకోగలుగుతారు. ఈ లెక్కన.. వచ్చే ఐదేళ్లలో ఒక్క ఎమ్మెల్సీ కూడా వైసీపీకి రావడం కష్టం. ఈ లోపు అందరి పదవి కాలం పూర్తవుతుంది. ఎమ్మెల్సీలు అందరూ తమకు మరో అవకాశం రావాలన్నా..రాజకీయంగా కాస్త పలుకుబడి ఉండాలన్నా అధికార పార్టీలో ఉండాలనుకుంటారు. అందుకే టీడీపీ ఆహ్వానాలపై పలువురు సానుకూలంగా స్పందించారనిచెబుతున్నారు. ఉత్తరాంధ్ర, కోస్తాల్లో కూటమికి వచ్చిన మెజారిటీలు చూస్తే ఎవరికైనా వైసీపీకి భవిష్యత్ ఉందని అనుకోరు. ప్రతి నియోజకవర్గంలోనూ యాభై వేల మెజార్టీ కనిపించింది. గత ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఓడిపోయిన గాజు వాక నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ 95వేలు వచ్చింది. ఇక్కడ ఇండిపెండెంట్ గా పోటీ చేసిన ఓ అభ్యర్థికి గాజు గ్లాస్ గుర్తు కేటాయిస్తే ఐదు వేల ఓట్లు వచ్చాయి. అలాంటి వేవ్ కనిపించింది. వైసీపీ అసలు లెక్కలే లేదన్న అభిప్రాయం ఉంది. గుంటూరు వరకూ అదే పరిస్థితి ఉంది. అందుకే ఎక్కువ మంది వైసీపీ నేతలు.. ముఖ్యంగా కాపు నేతలంతా జనసేన పార్టీ వైపు చూస్తున్నారని చర్చ జరుగుతోంది. అందులో తాజా మాజీ మంత్రులు కూడా ఉన్నారని అంటున్నారు. కొంత మంది ఇటీవల కూటమి ప్రభుత్వంపై సానుకూల ప్రకటనలు చేస్తున్నారు. వారు తమకు ఇష్టమైన పార్టీలతో అంతర్గతంగా చర్చల్లో ఉన్నారని అంటున్నారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ కూడా ఆకర్ష్ కు ప్రయత్నాలు చేస్తోంది. వైసీపీకి భవిష్యత్ లేదని.. విజయమ్మ కూడా కాంగ్రెస్ వైపే ఉన్నారని వైఎస్ ఆత్మీయులందరూ కాంగ్రెస్ లోకి రావాలని పిలుపునిస్తున్నారు.అంతర్గతంగా ఈ విషయంపై కాంగ్రెస్ హైకమాండ్ తో కొంత మంది సంప్రదింపులు జరుపుతున్నారని కూడా అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపును కడప ఎంపీ బరిలో ఉన్న వైఎస్ షర్మిలను ప్రజలు గెలిపించాలని విజయమ్మ కోరారు. మళ్లీ ఆమె జగన్ వైపు వెళ్తారని అనుకోవడం లేదు. ఈ పరిణామాలన్నింటితో పార్టీ నేతల్ని కాపాడుకోవడం అంత తేలిక కాదని జగన్ గట్టి గా నమ్ముతున్నారు. వారిని బుజ్జగించడం కన్నా..ఉంటే ఉన్నారు..పోతే పోయారు అన్నట్లుగా ఉండాలని డిసైడయ్యారని చెబుతున్నారు. అదే భావన ఆయన మాటల్లో వ్యక్తమవుతోందని అంటున్నారు.

అనిల్ కు ప్రాధాన్యం

సొంత సామాజికవర్గం దూరం...

నెల్లూరు, జూలై 6, వైసీపీలో కులాల కుంపట్లు బయటపడ్డాయా? ఓటమికి కారణం మీరంటే మీరు అని నేతలు కయ్యానికి దిగుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో వైసిపి పతనానికి మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కారణమని రెడ్డి సామాజిక వర్గం ఆరోపణలు చేయడం విశేషం. అనిల్ తీరుతోనే ఎన్నికలకు ముందు రెడ్డి సామాజిక వర్గం నేతలంతా టిడిపిలో చేరిపోయారని ప్రచారం సాగుతోంది. ఇప్పుడు ఓటమితో స్వయంగా వైసీపీలోని రెడ్డి సామాజిక వర్గం అనిల్ తీరుపై రుస రుసలాడుతోంది. ఆయనకు ఇప్పటికీ జగన్ ప్రాధాన్యత ఇవ్వడాన్ని తప్పుపడుతోంది రెడ్డి సామాజిక వర్గం. నిన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జగన్ పరామర్శించిన క్రమంలో.. వైసీపీ శ్రేణుల మధ్య చిన్నపాటి వాదన రేగినట్లు సమాచారం.వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న జిల్లాల్లో నెల్లూరు ఒకటి. 2014లో ఏకపక్ష విజయం అందించింది ఆ జిల్లా. 2019లో అయితే క్లీన్ స్వీప్ చేసింది. కానీ 2024 ఎన్నికలకు వచ్చేసరికి సీన్ మారింది. టిడిపి కూటమి వైట్ వాష్ చేసింది. అయితే ఇంతటి భారీ ఓటమికి మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2019లో అధికారం చేపట్టిన జగన్ తన మంత్రి వర్గంలోకి అనిల్ కుమార్ యాదవ్ ను తీసుకున్నారు. దీంతో ఆయన స్థానిక రెడ్డి సామాజిక వర్గాన్ని పట్టించుకోలేదు. జగన్ ను గౌరవిస్తూ నెల్లూరు జిల్లాలో పెద్ద రెడ్లనుదారుణంగా అవమానించారు. దీంతో ఎన్నికలకు ముందే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి,ఆన రామనారాయణ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పార్టీకి దూరమయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నెల్లూరు పార్లమెంట్ స్థానం అభ్యర్థి వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన భార్య ప్రశాంతి రెడ్డిని అనిల్ టార్గెట్ చేసుకున్నారు. కానీ జగన్ నుంచి వారికి స్వాంతన లభించలేదు. తిరిగి అనిల్ కు మద్దతు తెలిపారు జగన్. అందుకే ఆ దంపతులు పార్టీకి దూరమయ్యారు. వైసీపీ క్యాడర్ను తీసుకెళ్లి టిడిపిలో చేరిపోయారు. నెల్లూరు జిల్లాలో వైసీపీకి ఈ గడ్డు పరిస్థితికి కారణమయ్యారు.వైసీపీకి మూలస్తంభంలా నిలబడ్డారు వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి. అటువంటి వేంరెడ్డిపై చాలా సందర్భాల్లో అనిల్ కుమార్ యాదవ్ విరుచుకుపడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి భార్య ప్రశాంతి రెడ్డిని రాజమాతగా తులనాడుతూ అనిల్ చేసిన వ్యాఖ్యలు విపరీతంగా ప్రభావం చూపాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం అనిల్ తీరును వ్యతిరేకించడం ప్రారంభించింది. అయితే జగన్ అనిల్ కు వెన్నుతట్టి ప్రోత్సహించడంతో ఆ ప్రభావం వైసీపీ పై పడింది. వైసీపీని సైతం రెడ్డి సామాజిక వర్గం వ్యతిరేకించడం ప్రారంభించింది. అదే నెల్లూరు జిల్లాలో టిడిపి కూటమి గెలుపునకు కారణమైంది. నిన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామర్శకు జగన్ వచ్చిన తరుణంలో.. పార్టీ శ్రేణుల మధ్య ఇదే హాట్ టాపిక్ గా మారినట్లు తెలుస్తోంది.

ఆలయ దుకాణాలు సీజ్

పరిగి,శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఎండోమెంట్ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. ఆలయ సంబంధించిన దుకాణాలు ఎండోమెంట్ ఆధీనంలో ఉండగా ఆరు నెలల నుంచి దుకాణ సముదాయాల అద్దె చెల్లించకపోవడంతో దుకాణ సముదాయాలను సీజ్ చేశారు అధికారులు.వికారాబాద్ జిల్లా పరిగి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం 23 దుకాణ సముదాయాలకు తాళాలు వేసి సీజ్ చేసిన ఎండోమెంట్ అధికారులు.ఎండోమెంట్ అధికారులతో వాగ్వాదానికి దిగిన అద్దెకు తీసుకున్న దుకాణదారులు.ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచి ఎండోమెంట్ ఆధీనంలోకి తీసుకున్నం.మార్చి నుంచి దేవదాయ శాఖకు చెందిన 23 దుకాణాల అద్దె కట్టడంలేదని , ఇవ్వనివారి దుకాణాలను తాళాలు వేసి సీజ్ చేసినట్లు తెలిపారు అధికారులు.23 దుకాణాలకు కొంత మందే రెంట్ చెల్లిస్తున్నారని మరికొందరు చెల్లించకపోవడంతో సీజ్ చేశారు అధికారులు.ఎండోమెంట్ అధికారులతో వాగ్వాదానికి దిగిన అద్దెకు తీసుకున్న దుకాణదారులు.ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచి ఎండోమెంట్ ఆధీనంలోకి తీసుకున్నం.మార్చి నుంచి దేవదాయ శాఖకు చెందిన 23 దుకాణాల అద్దె కట్టడంలేదని , ఇవ్వనివారి దుకాణాలను తాళాలు వేసి సీజ్ చేసినట్లు తెలిపారు అధికారులు.ఈనేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. తరువాత అద్దెకట్టిన దుకాణాల తాళాలను తొలగించారు.

కాంగ్రెస్ వేదికపై విజయమ్మ...

విజయవాడ, జూలై 6, (న్యూస్ పల్స్) ఏపీలో కీలక రాజకీయ పరిణామం. మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలపై ఉత్కంఠ కొనసాగుతోంది. తండ్రి పేరుతో జగన్ పార్టీ పెట్టారు. అధికారంలోకి రాగలిగారు. గత ఐదేళ్లలో వైయస్ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధికారిక కార్యక్రమం గా ప్రకటించి మరి వేడుకలు జరిపారు. కానీ ఈ ఏడాది అధికారానికి వైసీపీ దూరం కావడంతో? కేవలం ఇడుపులపాయలో నివాళులు అర్పించేందుకు మాత్రమే జగన్ ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ తరఫున అట్టహాసంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించేందుకు షర్మిల సిద్ధపడుతున్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకులతో పాటు కీలక నేతలంతా హాజరయ్యే అవకాశం ఉంది. అయితే వారితో విజయమ్మ వేదిక పంచుకోనుండడం హాట్ టాపిక్ గా మారింది.కడప ఎంపీగా ఉంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని విభేదించారు జగన్. నాడు జగన్ కు అండగా నిలిచి కాంగ్రెస్ అధినాయకత్వంతో విభేదించారు విజయమ్మ. షర్మిల సైతం కాంగ్రెస్ అగ్రనాయకత్వంపై తీవ్ర విమర్శలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. ఆ కుటుంబం స్వరంలో మార్పు వచ్చింది. భవిష్యత్తును వెతుక్కుంటూ షర్మిల కాంగ్రెస్ పంచన చేరారు. విజయమ్మ సైతం ఆమెను ఆశీర్వదించక తప్పలేదు.ఇప్పుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను షర్మిల కాంగ్రెస్ పార్టీ తరఫున నిర్వహిస్తుండడంతో విజయమ్మ తప్పనిసరిగా హాజరు కావాలి. గతంలో కాంగ్రెస్ తన కుటుంబానికి తీవ్ర అన్యాయం చేసిందని పలుమార్లు విజయమ్మ విమర్శలు చేశారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలతో వేదిక పంచుకునేందుకు సిద్ధమవుతున్నారు. కేవలం షర్మిల కాంగ్రెస్ పార్టీలో ఉండడంతో విజయమ్మకు ఈ అనివార్య పరిస్థితి ఏర్పడింది.ఈ ఎన్నికల్లో వైసిపి దారుణ పరాజయం పాలయ్యింది. అదే సమయంలో సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంది. అటు కర్ణాటకతో పాటు తెలంగాణలో సైతం అధికారంలో ఉంది. సరిగ్గా ఈ సమయంలో ఏపీలో సైతం బలపడడానికి అవకాశం కలిగింది. అందుకే వైయస్ జయంతి వేడుకలను బలప్రదర్శనగా భావిస్తున్నారు షర్మిల. విజయవాడలో అట్టహాసంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, సిద్ధరామయ్య, ఖర్గే సహా పెద్దలందరినీ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంతో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటడానికి చూస్తున్నారు. అయితే పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అగ్రనేతలు హాజరవుతారా? లేదా? అన్నది చూడాలి.

ఆషాఢంలో దుర్గమ్మ ఆరాధన ఎందుకంత ప్రాముఖ్యత?

- సారె మహోత్సవం వెనుక కథేంటి?

ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు ఎన్నడూ లేని విధంగా ఇంద్రకీలాద్రిపై భక్తులు కిటకిటలాడతారు. మేళతాళాలతో వచ్చి దుర్గమ్మకు సారె సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.అయితే ఆషాఢం మాసంలో ఇంద్రకీలాద్రిపై సారె మహోత్సవం ఎందుకు నిర్వహిస్తారో మీకు తెలుసా?

తెలుగు పంచాంగం ప్రకారం ఆషాఢ మాసం రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఎలాంటి శుభకార్యాలూ జరగకపోయినా పూజాది కార్యక్రమాలకు ఈ మాసం ఎంతో పవిత్రమైనది. ఒక్క ఆషాఢ మాసంలోనే సుమారు 2లక్షలకు పైగా భక్తులు విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకుంటారు. సారె రూపంలో తమకు తోచిన వస్తువుల్ని ఇంద్రకీలాద్రి అమ్మవారికి ఉడతాభక్తిగా సమర్పించుకుంటారు. ఈ మాసంలోనే అమ్మవారు శాకాంబరీ దేవిగానూ దర్శనమిస్తారు.

ఆషాఢ మాసంలో శుభకార్యాలు ఎందుకు నిషేధం?:

పురాణాల ప్రకారం ఆషాఢ మాసంలో శ్రీ మహా విష్ణువు 4 నెలల పాటు విశ్రాంతి తీసుకుంటాడు. ఈ నేపథ్యంలోనే ఆషాఢ మాసంలో శుభ కార్యాలు చేయడాన్ని నిషేధించారు. అయితే ఈ మాసం తీర్థయాత్రలు,ఉపవాస దీక్షలువంటిపూజాదికార్యక్రమాలకు అనువైనది. వ్యవసాయానికి ఈ మాసం చాలా ప్రాముఖ్యమైనది

ఇంద్రకీలాద్రిపై సారె మహోత్సవం:

విజయవాడ కనకదుర్గమ్మకు ఏడాదిలో 4సార్లు నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. చైత్రమాసంలో వసంత నవరాత్రోత్సవాలు, ఆషాఢంలో వారాహి ఉత్సవాలు, ఆశ్వయుజ మాసంలో దసరా శరన్నవరాత్రులు, మాఘమాసంలో శ్యామలా నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తారు. వీటిలో ఆషాఢంలో వచ్చే వారాహి నవరాత్రుల్లో రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు ఈ నెలమొత్తం అమ్మవారికి మొక్కుల రూపంలో సారెను సమర్పిస్తారు. కొందరు అమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి సారె పెడితే, మరికొందరు తమ మొక్కులు చెల్లించుకునేందుకు ఇదే అనువైన కాలమని భావిస్తారు.

ఎలా ప్రారంభమైందంటే:

దుర్గమ్మకు సారెను సమర్పించటం వల్ల పంటలు బాగా పండుతాయనీ, ఎలాంటి అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటామని భక్తులు భావిస్తారు. ఈ నేపథ్యంలోనే విజయవాడ కనకదుర్గమ్మకు ఈ మాసంలో భక్తులు బృందాలుగా ఏర్పడి వస్త్రాలు, పూలు, పండ్లు, మిఠాయిలు, గాజులు, కొబ్బరికాయలు సమర్పిస్తారు. అయితే కొన్నేళ్ల క్రితం వరకూ భక్తులకు ఈ అవకాశం ఉండేది కాదు. కేవలం తిరుమల తిరుపతి దేవస్థానం, ద్వారకా తిరుమల, అన్నవరం, పెనుగంచిప్రోలు తదితర ఆలయాల నుంచి మాత్రమే దుర్గమ్మకు ఆషాఢం సారె వచ్చేది. తెలంగాణ నుంచి కూడా మహంకాళి దేవాలయాల కమిటీ తరఫున బంగారు బోనం సమర్పించేవారు. 2016లో ఆలయ ఈవో సూర్యకుమారి భక్తులకు కూడా అవకాశం కల్పించటంతో అప్పటి నుంచి భక్తులు సారెను సమర్పించటం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో రేపటి నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై మహోత్సవాన్ని ఆషాఢం సారె మహోత్సవం నిర్వహించనున్నారు.

శాకాంబరి దేవి ఉత్సవాలు ఎందుకు?:

దేవీభాగవతం, మార్కండేయ పురాణాల ప్రకారం కనకదుర్గ అవతారానికి పూర్వం అమ్మవారు శాకంబరిగానే అవతరించిందనడానికి ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. ఒకప్పుడు భూలోకంలో వర్షాలు లేక పంటలు పండక అనావృష్టి సంభవించిందట. ప్రజల బాధలు చూడలేక ఋషులు జగన్మాతను ప్రార్థించినప్పుడు అమ్మవారు శతాక్షీదేవిగా అవతరించిందట. ఆ దేవి తన దేహం నుంచి శాకములను(కాయగూరల్ని) సృష్టించి ప్రజల ఆకలిని తీర్చడం వల్లే శాకంబరిగా పూజలందుకుందట. అందుకే దుర్గాదేవిని ఈ ఆషాఢంలో శాకంబరిగా కొలుస్తారని చెబుతుంటారు.

ఇంద్రకీలాద్రిపై జులై 19 నుంచి 21 వరకు శాకాంబరి దేవి ఉత్సవాలు నిర్వహించనున్నారు. మూడురోజులపాటు ఘనంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో మొదటిరోజు ఆకుకూరలూ, రెండోరోజు కాయగూరలూ, మూడో రోజు వివిధ రకాల ఎండు ఫలాలతో ఆలయాన్ని, దుర్గమ్మను అలంకరిస్తారు. వాటన్నింటినీ కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన రైతులూ వ్యాపారులూ అందించడం విశేషం. అలా వినియోగించిన కూరగాయలను తరువాత భక్తులకు కదంబ ప్రసాదంగా పంపిణీ చేస్తారు.

పవన్ మార్క్ ... పాలనా..

కాకినాడ, జూలై 6,జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అధికారంలోకి రాకముందు.. వచ్చిన తర్వాత చూస్తే పూర్తిగా మారిపోయినట్లే కనిపిస్తుంది. గత నెల 12వ తేదీన డిప్యూటీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పవన్ కల్యాణ్ తీరును గమనించిన వాళ్లు ఎవరైనా ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. వారాహి అమ్మవారి దీక్షలో ఉన్నప్పటికీ, అంతకు ముందు కూడా ఆయన పూర్తిగా సంయమనం పాటిస్తున్నారనే అనుకోవాలి. ఎందుకంటే ఎక్కడా పవన్ కల్యాణ? ఎక్కువ మాట్లాడటం లేదు. పవన్ కల్యాణ్ ను దగ్గర నుంచి చూసిన వారికి ఎన్నికలకు ముందు, తర్వాత ఇంత మార్పేమిటి అంటూ ఆశ్చర్యపోతున్నారంటే అతిశయోక్తి కాదు. ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ? ఊగిపోయేవారు. ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడే వారు. చెప్పులు చూపించారు. కొన్ని వాడకూడని పదాలను కూడా వాడారు. ఆయన జనంలో ఎక్కువగా ఇమడలేనట్లుగా కనిపించారు. ఆవేశంతో ఊగిపోతూ చేసిన ఆయన ప్రసంగాలపై అప్పట్లో కొందరు రాజకీయ విశ్లేషకులు సయితం విమర్శలు చేశారు. ఎందుకంటే రాజకీయ నేతలకు అంత ఆవేశం పనికి రాదని, సహనంతో పాటు కొంత కంట్రోల్ లో ఉండాలని అనేక మంది అభిప్రాయపడ్డారు కూడా. ఒక దశలో అధికారంలోకి రాకముందే ఇలా ఉంటే, ఇక పవర్ లోకి వస్తే ఏం చేస్తారోనన్న కామెంట్స్ కూడా అనేక మంది నుంచి వినిపించాయి. తాను డిప్యూటీ ముఖ్యమంత్రి అయినప్పటికీ ఎక్కడా ఆయన దర్పం ప్రదర్శించడం లేదు. అనవసర ఖర్చులు చేయడం లేదు. ప్రజలతో మమేకం అవుతున్నారు. తన వద్దకు వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించడానికి ఆయన తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. మిస్సింగ్ అయిన ఒక యువతిని తొమ్మిది రోజుల్లో తెప్పించారంటే పవన్ కల్యాణ్ ఏ మేరకు తాను పనిలోకి దిగారో అర్థం చేసుకోవచ్చు. అంతే కాదు. అధికారులపై ఎవరూ దుర్భాషలాడవద్దని చెప్పడం కూడా ఆయన పరిణితికి అద్దంపడుతుంది. అధికారులంటే మనం చెప్పింది చేసినట్లు చేసేవాళ్లని, అధికారులను దూషిస్తే పార్టీ పరంగా చర్యలను కూడా తీసుకుంటానని జనసేన ఎమ్మెల్యేలను, పార్టీ నేతలకు కూడా పిఠాపుం వేదికగా వార్నింగ్ ఇచ్చారంటే ఆయనలో వచ్చిన మార్పునకు ఇంతకంటే మరే ఉదాహరణ అవసరం లేదు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నప్పటికీ వాటిని ఒక స్థాయి వరకే పరిమితం చేసుకున్నారు. అంతే తప్ప గతంలోలా ఆవేశపడి పోవడం లేదు. తాను చేయదలచుకున్నది, చేసేది మాత్రమే ప్రజలకు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితి సహకరిస్తే తాను మంత్రిగా మరింత బాగా పనిచేస్తానని ప్రజలకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. తనకు కేటాయించిన శాఖలపై క్రమంగా అవగాహన పెంచుకుంటున్న పవన్ కల్యాణ్ పూర్తిగా గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. సినిమాలకు కూడా మూడు నెలల పాటు దూరంగా ఉంటానని, ఇప్పటి వరకూ అంగీకరించిన సినిమాలకు మూడు నెలల తర్వాత మాత్రమే డేట్స్ కొన్ని రోజులు కేటాయిస్తానని చెప్పుకొచ్చారంటే ఆయన పూర్తిగా బలపడే ప్రయత్నంలో ఉన్నారు. పార్టీకి సుదీర్ఘ భవిష్యత్ ను అందించడానికి ఆయన వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. మొన్నటి ఎన్నికల్లో సక్సెస్ అయిన పవన్ స్ట్రాటజీ ఈ వ్యూహం కూడా వర్క్ అవుట్ అవుతుందని జనసేన నేతలు ఆశిస్తున్నారు.

సింపతి కోసం మార్గాని దారుణం.

రాజమండ్రి, జూలై 6 ఏపీలో జగన్ కు అత్యంత సన్నిహితమైన నేతల్లో మార్గాని భరత్ ఒకరు. తొలుత సినిమాల్లో నటించి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. సినిమాల కంటే రాజకీయాలే ఉత్తమమని భావించి వైసిపి ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. తొలి ప్రయత్నం లోనే భారీ మెజారిటీతో ఎంపీగా గెలిచారు. ఈసారి మాత్రం రాజమండ్రి అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.వైసీపీలో ఉన్నప్పుడు అతిగా వ్యవహరించే వారన్న విమర్శ ఉంది.అయితే ఇప్పుడు ఓటమి ఎదురు కావడంతో జీర్ణించుకోలేకపోతున్నారన్న ప్రచారం ఉంది.ఈ నేపథ్యంలోనే ఆయన తన ప్రచార రథాన్ని ప్రత్యర్థులు దగ్ధం చేశారని ఏకంగా డీజీపీకి ఫిర్యాదు చేశారు. కానీ పోలీసు విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.చిన్ననాటి నుంచి సినిమాలంటే భరత్ కు ఆసక్తి. హీరో కావాలన్నదే ధ్యేయం. అందుకే విశాఖలోని సత్యానంద ఫిలిం ఇన్స్టిట్యూట్లో చేరి శిక్షణ పొందారు. భరత్ నటనలోనే కాదు క్రీడల్లోనూ రాణించేవారు. అయితే ఉన్నట్టుండి రాజకీయ అవతారం ఎత్తడంతో.. పూర్తి సీన్ మారింది. చేతిలోకి పవర్ రావడంతో రెచ్చిపోయారు భరత్. జగన్ పై ఈగ వాలనిచ్చేవారు కాదు. ఎంపీగా ఉంటూ గుడ్ మార్నింగ్ రాజమండ్రి అంటూ రెచ్చిపోయేవారు. పవన్ అంటే తీవ్రస్థాయిలో విరుచుకుపడేవారు. అమరావతి టు అరసవల్లి స్వామి వారి దర్శనానికి వెళ్తున్న రాజధాని రైతులపై దాడులు చేయించారన్న విమర్శ కూడా భరత్ పై ఉంది. అయితే భరత్ ను అసెంబ్లీకి పంపించి మంత్రి పదవి ఇవ్వాలని జగన్ భావించారు. కానీ జనం మాత్రం యాక్సెప్ట్ చేయలేదు. భరత్ ను దారుణంగా ఓడించడంతో పాటు వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు.అయితే రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపిస్తూ మార్గాని భరత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ప్రచార రథాన్ని టిడిపి నేతలు కాల్ చేశారని వారం రోజుల కిందట భరత్ హడావిడి చేశారు. స్వయంగా అమరావతి వెళ్లి డిజిపికి ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీరియస్ గా తీసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.అయితే ఆ రథాన్ని దగ్ధం చేసింది వైసీపీ కార్యకర్త,భరత్ అనుచరుడు దంగేటి శివాజీ. జూన్ 28న మార్గాని ఎస్టేట్స్ కార్యాలయంలో ప్రచార రథాన్ని తగులు పెట్టాడు. భరత్ ఓడిపోవడంతో ప్రజల్లో సానుభూతి, టిడిపికి చెడ్డ పేరు తెచ్చేందుకే ఈ ఘటనకు పాల్పడినట్లు విచారణలో తేలింది. అయితే ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భరత్ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. సోషల్ మీడియాలో ఓ వీడియోని విడుదల చేశారు ఆయన. సానుభూతి కోసం ఆ పని చేయలేదని.. కావాలంటే దేవుడి గుడిలో ప్రమాణానికి సిద్ధమని చెప్పుకొచ్చారు. అయితే భరత్ తనకు తాను ఈ వీడియోను బయట పెట్టడంతో.. తెర వెనుక వ్యవహారాన్ని ఇట్టే పసిగడుతున్నారు నెటిజెన్లు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

తాండూరు,బతుకు దెరువు కోసం వచ్చిన కూలీ కుటుంబంలో రోడ్డు దుర్మరణం విషాదం నింపింది. ఈ సంఘటన శనివారం ఉదయం తాండూరు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, కరణ్ కోట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ జిల్లా గుత్తి మండలం అనగాని దొడ్డికి చెందిన మదం హన్మంతు, వరలక్ష్మిలు కుటుంబంతో కలిసి తాండూరు మండలానికి వలస వచ్చారు. గోపన్ పల్లి సమీపంలోని ఒక వ్యాపారి పాలిషింగ్ యూనిట్లో కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం హన్మంతు తన తన కూతురు, కుమారుడు మధం జనార్ధన్(8)ను తాండూరు పట్టణంలోని విజయ విద్యాలయ పాఠశాలలో వదిలేందుకు బైకుపై బయల్దేరాడు.గ్రామ సమీపంలోకి రాగానే బైకును లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ క్రమంలో కిందపడిన జనార్దన్ తల నుజ్జు నుజ్జయ్యింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు.

చంద్రబాబు పై ఉన్న కేసులు అన్నీ సీబీఐకి అప్పగించండి: హైకోర్టులో పిల్...

చేసిన స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ బాల గంగాధర్ తిలక్

చంద్రబాబు సహా 114 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ పిల్ దాఖలు

స్కిల్ డెవలప్‌మెంట్ సహా నేతలపై కేసులన్నీ సీబీఐ, ఈడీలకు అప్పగించాలని కోరిన వైనం

ఫలితాల రోజునుంచే అధికారులు కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణనిష్పాక్షిక, పాదర్శకమైన దర్యాప్తు కోసం కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలంటూ పిటిషన్

ముఖ్యమంత్రి చంద్రబాబు సహా పలువురు టీడీపీ నేతలు, వ్యాపారవేత్తలపై ఉన్న కేసులన్నీ సీబీఐ, ఈడీలకు అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ హైకోర్టులో ప్రజాప్రయోజనవ్యాజ్యం దాఖలైంది. స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కొట్టి బాలగంగాధర్ తిలక్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, పొంగూరు నారాయణ, కింజారపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, వ్యాపారవేత్తలు లింగమనేని రమేశ్, వేమూరు హరికృష్ణ సహా మొత్తం 114 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తాను వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం, మద్యం కుంభకోణం, ఏపీ ఫైబర్ నెట్ కుంభకోణం, అసైన్డ్ భూము?ల కుంభకోణం, ఇసుకు కుంభకోణం, ఇన్నర్ రింగు రోడ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు తదితర స్కామ్‌లకు సంబంధించి దర్యాప్తు బాధ్యతలను సీబీఐ, ఈడీలకు అప్పగించాల్సిన అవసరం ఉందన్నారు. నిష్పాక్షిక, పారదర్శక, వేగవంతమైన దర్యాప్తు కోసం కేసులను సీబీఐ, ఈడీకి అప్పగించాలని అభిప్రాయపడ్డారు. ఫలితాలు వెలువడిన రోజునే.. "ఫలితాలు వెలువడిన రోజున డీజీపీగా, పోలీసు బలగాలకు అధిపతిగా ఉన్న హరీశ్ కుమార్ గుప్తా సీఐడీలోని ఆర్థిక నేరాల విభాగానికి తాళాలు వేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, ఇతర టీడీపీ నేతలపై నమోదైన కేసులను దర్యాప్తు చేస్తున్న అధికారులకు ప్రవేశాన్ని నిరాకరించారు. చంద్రబాబు తదితరులు అధికారంలోకి వస్తున్నారని గ్రహించి, ఆయా కేసులను దర్యాప్తు చేస్తున్న అధికారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అంతేకాక, మధ్యాహ్నం 12.30 గంటలకు రహస్యంగా సాయుధులను అక్కడ మోహరించారు. కౌంటింగ్ జరుగుతుండగానే ఆర్థిక నేరాల విభాగం నుంచి అధికారులందరినీ వెళ్లిపోమ్మన్నారు. ఈ విషయాలన్నీ పత్రికల్లో వచ్చాయి. ఓ డీజీపీ ఈ విధంగా చేయడం చట్టవిరుద్ధం, ఏకపక్షం, దౌర్జన్యపూరితం" అని పిటిషనర్ తిలక్ పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచీ డీజీపీ, సీఐడీ అదనపు డీజీ తదితరులందరూ కూడా ఈ కేసుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తిలక్ వివరించారు. ఈ కేసుల్లో సీఐడీ, ఈడీ ఇప్పటివరకూ చేసిన దర్యాప్తును చంద్రబాబు, ఇతర నేతలకు అనుకూలంగా నీరు గార్చేలా వ్యవహరిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో హైకోర్టు ఈ కేసుల దర్యాప్తును సీబీఐ, ఈడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోరారు. ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ అప్పటి ఎండీ హోదాలో డి. వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసిందని తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేశారన్నారు. ఇసుక కుంభకోణంపై ఫిర్యాదు చేసినందుకు గనుల శాఖ అప్పటి డైరెక్టర్ జి.వెంకట రెడ్డిపై కక్ష తీర్చుకుంటున్నారన్నారు. తమపై ఫిర్యాదు చేసిన వారందరిపై చర్యలు తీసుకుంటామని రెడ్ బుక్ పేరిట పలువురు అధికారులను వేధిస్తున్నారని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోర్టును కోరారు.

అవినీతి కేసులో గుంతకల్లు డిఆర్ఎం

వినీత్ సింగ్‌ను అరెస్ట్ చేసిన సిబిఐ

కంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేయడంతో అరెస్ట్

అనంతపురం,జూలై6 : అవినీతి కేసులో గుంతకల్లు డీఆర్ఎం వినీత్ సింగ్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. కడప జిల్లాకు చెందిన ఓ రైల్వే కాంట్రాక్టర్‌ను రైల్వే అధికారులు లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రైల్వే అధికారులపై సీబీఐకి కాంట్రాక్టర్ రమేష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు రెండు రోజుల పాటు అధికారులు తనిఖీలు చేపట్టారు. అనంతరం గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌తో పాటు, కుందా ప్రదీప్ బాబు, అక్కిరెడ్డి, బాలాజీ, లక్ష్మీపతి రాజులను సీబీఐ అదుపులోకి తీసుకుంది. గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలో జరిగిన కాంట్రాక్ట్ పనుల్లో రైల్వే అధికారులు కోట్ల రూపాయల్లో అవినీతికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగా గుంతకల్లు డీఆర్ఎం వినీత్ సింగ్‌లతో పాటు మిగిలిన వారిని అరెస్ట్ చేసిన సీబీఐ అధికారులు.. వారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు ముగిసిన అనంతరం అరెస్టు అయిన రైల్వే అధికారులను సికింద్రాబాద్ తరలిస్తున్నారు. గుంతకల్లు రైల్వే డీఆర్ఎం కార్యాలయం వివిధ విభాగాల్లో సీబీఐ సోదాలు చేసింది. రైల్వే డీఆర్ఎం వినీత్‌సింగ్ నివాసంలో తనిఖీలు పూర్తయ్యాయి. సింగ్ నివాసంలో భారీగా బంగారం, నగదు పట్టుబడింది. ఎనిమిది మంది సిబ్బందిని సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్, డీఎఫ్ఎం ప్రదీప్ బాబు, సిబ్బంది రాజు, ప్రసాద్, బాలాజీ సీబీఐ అదుపులో ఉన్నారు. నిందితులను వైద్య పరీక్షల నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం వారిని సీబీఐ కోర్టుకు తరలించనున్నారు. గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయంలో భాగమైన ఆర్థిక విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది నివాస గృహాల్లో సికింద్రాబాద్‌కు చెందిన సీబీఐ అధికారులు తనిఖీలు చేశారు. ఆర్థిక విభాగంలో పని చేస్తున్న సీనియర్ డివిజన్ ఫైనాన్స్ మేనేజర్(డీఎఫ్ఎం) ప్రదీప్‌బాబుతో పాటు మరికొందరు సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడంతో సీబీఐ అధికారులు గత మూడు రోజుల నుంచి గుంతకల్లులో మకాం వేశారు. కదిరి ప్రాంతంలో రైల్వే మోరీ పనులకు సంబంధించి ఆ ప్రాంతానికి చెందిన గుత్తేదారులకు పనిని అప్పగించడానికి ఉత్తర్వులు ఇచ్చేందుకు ప్రదీప్‌బాబుతో పాటు కొందరు సిబ్బంది డబ్బును డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సీబీఐ అధికారులు తనిఖీ చేసి అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బంది గృహాల్లో దాడి చేసి..భారీగా నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు.

విజయవాడ సిఎస్ కార్యాలయం నుండి ఇసుక సరఫరాపై అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్‌కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, అదనపు ఎస్పీ నాగరాజు, డిఆర్ఓ మధుసూదన్ రావు తదితరులు

వికలాంగవిద్యార్థులకు అన్నదానం వితరణ

బద్వేలు,రాయచోటి లోని వికలాంగ విద్యార్థులకు శనివారం మానవతా ఆధ్వర్యంలో అన్నదానం తో పాటు విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు పండ్లు వితరణ చేశారు.రాయచోటి వృక్ష రక్షణ సమితి వ్యవస్థాపకులు తులసి రెడ్డి కుమారుడు క్రాంతి కుమార్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని భవిత (వికలాంగులు) స్కూల్ నందు మానవతా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారి ఆధ్వర్యంలో వికలాంగుల విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు, పండ్లు, కిడ్స్ తో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మానవతా శాఖ అధ్యక్షులు గూడూరు ఖధర్ భాష, సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు గంగాధర్ నాయుడు, చైర్మన్ అరమాటి శివగంగారెడ్డి, గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, కో చైర్మన్ షకీల్ , లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవస్థాపకులు,జిల్లా జి ఎల్ టి కో ఆర్డినేటర్ లయన్ హరినాద్ రెడ్డి,ఫాస్ట్ రిజన్ చైర్మన్ నారాయణ రెడ్డి తో పాటు సమిళిత ఉపాధ్యాయులు త్రిలోక్,జనార్ధన్,సిబ్బంది తో కలిసి విద్యార్థులకు ప్లేట్లు,గ్లాసులు,కిడ్స్ లను అందజేశారు.అనంతరం విద్యార్థులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృక్ష రక్షణ సమితి వ్యవస్థాపకులు తులసిరెడ్డి కుమారుడు క్రాంతికుమార్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని వికలాంగుల విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమం అన్నారు. వారి కుమారుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వారికి వారి కుటుంబ సభ్యులకు వారి వ్యాపారం దిన దినాభివృద్ధి చెంది ,అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధించాలని మనస్ఫూర్తిగా భగవంతుని కోరుకుంటున్నామన్నారు. తమ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా మానవతా లైన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం చేయడం నా పూర్వజన్మ సుకృతం అని పెద్దలు తులసి రెడ్డి తెలియజేశారు. జన్మదినం సందర్భంగా తమ విద్యార్థులను గుర్తించి వారికి ఒక పూట అన్నదాన కార్యక్రమం తో పాటు ప్లేట్లు క్లాసులు పండ్లు అందజేయడం భవిత స్కూల్ వృక్ష రక్షణ సమితి వ్యవస్థాపకుల తులసిరెడ్డి మానవతా సంస్థ లైన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ రోడ్ క్లబ్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో మానవతా కోశాధికారి మురళీమోహన్ ,సభ్యులు సయ్యద్ అష్రఫ్ అలీ, షేక్ అల్లా బకాష్, విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

ఈ భవనం ఒకప్పుడు బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం

ఇప్పుడు పిచ్చి మొక్కల నడుమ భవనం

బద్వేలు ,పిచ్చి మొక్కలు మురికి కాలువల మధ్య ఉన్న ఈ భవనం ఒకప్పుడు బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం ఇది అక్షర సత్యం ఈ భవనంలోనే డిపో మేనేజర్ తోపాటు సిబ్బంది విధులు నిర్వహించేవారు ఆ తర్వాత డిపో గ్యారేజీ ఏర్పడడం బస్టాండ్ విస్తరించడం గ్యారేజీ ముందు భాగంలోనే రహదారి పక్కన పక్క భవనాలు ఏర్పడడంతో డిపో మేనేజర్ కార్యాలయం ఆ భవనాల్లోకి తరలిపోయింది ఇప్పటికి కూడా డిపో మేనేజర్ కార్యాలయం పక్కా భవనాల్లోనే కొనసాగుతుంది పక్కా భవనాల్లోకి డిపో మేనేజర్ కార్యాలయం తరలిపోయిన తర్వాత పాత భవనాన్ని అధికారులు మర్చిపోయారు పాత భవనాన్ని గతంలో ఒక ప్రవేట్ పాఠశాలకు అద్దెకిచ్చారు ఆ ప్రైవేట్ పాఠశాల కూడా ఒకటి రెండు సంవత్సరాలు మాత్రమే ఇక్కడ కొనసాగింది ప్రవేట్ పాఠశాల కాళీ చేసిన తర్వాత ఆ భవనం గురించి ఎవరు కూడా పట్టించుకోలేదు ఇప్పుడు కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి భవనం పక్కనే మురికి కాలువ ప్రవహిస్తుంది కార్యాలయం చుట్టుపక్కల నివాస గృహాలు ఉండడంతో మురికి కాలువల వల్ల నివాస గృహాల వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు ఈ విషయం గురించి సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేకుండా పోయింది వర్షాకాలంలో అయితే ఇక్కడ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది సంబంధిత అధికారులు ఈ భవనం విషయంలో స్పందించి చర్యలు తీసుకుంటే స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు అంతేకాక ఎంతోకాలంగా ఈ భవనం నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంటుంది మరి ఈ భవనం విషయం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది వేచి చూడాలి.

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి.

నూతన ప్రభుత్వం కాంట్రాక్ట్- ఔట్సోర్సింగ్, వర్కర్లను తొలగించొద్దు

కాంట్రాక్ట్- అవుట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు కామనూరు శ్రీనివాస్ రెడ్డి

బద్వేలు , బద్వేల్ పట్టణం నందు సిఐటియు విస్తృతస్థాయి సమావేశం పి.సి కొండయ్య అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాలు రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూరాష్ట్రంలో స్కీమ్ కార్మికుల తొలగింపులు అపాలని సిఐటియు జిల్లా కమిటీ కోరింది. గతంలో పరిష్కారం కాని సమస్యలను కొత్త ప్రభుత్వం పరిష్కరిస్తుందని అంగన్వాడీలు, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర స్కీమ్ కార్మికులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంలోకి వచ్చిన పార్టీ కింది స్థాయి నాయకులు స్థానికంగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను పని మానేయాలని బెదిరిస్తున్నారని, తద్వారా వారి మనుషులను పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో ఒక అంగన్వాడీ వర్కర్ ఈ ఒత్తిడి తట్టుకోలేక ఆస్పత్రిలో చేరాల్సి వచ్చిందని వివరించారు. ఇదే జిల్లాలో మరో రెండు చోట్ల హెల్పర్లను బయటకు పంపి తమ వారిని పనిలో పెట్టుకోవాలని ఆదేశాలు ఇస్తున్నారనితెలిపారు. అనంతపురం జిల్లా వజ్రకరూరులో కూడా మధ్యాహ్న భోజన కార్మికురాలిపై స్థానిక అధికార పార్టీ నాయకులు దాడి చేశారని వివరించారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక పురుగుమందు తాగి ఆమె చావుబతుకుల్లో ఉందని తెలిపారు. ఇతర కార్మికులపై కూడా ఒత్తిడి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీలు మారినప్పుడల్లా కొత్తగా ప్రభుత్వంలోకి వచ్చినవారు స్కీం వర్కర్లపై దాడి చేయడం ఒక రివాజుగా మారిందని విమర్శించారు. వర్కర్ల పని పరిస్థితులకు సంబంధించి కొన్ని విధి విధానాలున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీ వారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలని, అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర చట్టం ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, పట్టణ నాయకులు ఆంజనేయులు, రాజగోపాల్, సుబ్బరాయుడు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రవీణ్ కుమార్,మురళి,సుధాకర్,పెంచలయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు హరి, ఆటో యూనియన్ నాయకులు ఓబులేసు, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు ఓబయ్య, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ చంద్రబాబును విమర్శించడం హాస్యాస్పదం

నెల్లూరు,మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్... పిన్నెల్లికి మరిన్ని కేసుల్లో శిక్ష పడేలా సాక్ష్యం చెప్పి వెళ్లారని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈవీయం పగులకొట్టాడని జగన్ చెప్పిన సాక్షాన్ని పరిగణలోకి తీసుకొని పిన్నెల్లిని శిక్షించాలని ఆనం కోరారు. నెల్లూరు సంతపేటలో ఆనం, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు మంత్రులు జిల్లా అభివృద్ధిపై చర్చించారు. ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ నెల్లూరు జిల్లాకు వచ్చి చంద్రబాబుని విమర్శించడం హాస్యాస్పదమని ఈ సందర్భంగా ఆనం విమర్శించారు. భవిష్యత్ లో వైఎస్సార్సీపీ మనుగడ సాధించలేదని జగన్మోహన్ రెడ్డి చెప్పి వెళ్లారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో భయపడిన వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు స్వేచ్ఛ వచ్చిందని మంత్రి నారాయణ వెల్లడించారు. నెల్లూరు, కడప జిల్లాల్లోని లే అవుట్లలో అక్రమాలు జరిగాయాన్ని చంద్రబాబు సూచించడంతో విచారణకు ఆదేశించామని చెప్పారు. ఈస్ట్ గోదావరి తోపాటు ఇతర జిల్లాల్లో టీడీఎస్ బాండల్లో జరిగిన అవినీతిపైన కమిటీ వేశామన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన సోమశిల జలాశయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు.

మాన్యం కౌలు వేలం లో భారీగా పెరిగిన ఆదాయం..

దొర్నిపాడు,జులై:06, శ్రీ ప్రస్థానం న్యూస్ :- మండలంలోని చాక రాజు వేముల గ్రామం,లో వెలసిన"శ్రీ"గౌరీ భోగేశ్వర స్వామి, శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి, ఆలయాలకు సంబంధించిన మాన్యం భూములు మొత్తం 90.14 సెంట్లు కౌలు హక్కుకు బహిరంగ వేలం పాట నిర్వహించగా గత ఏడాది తో పోలిస్తే ఈ ఏడాది సుమారు రూ.3 లక్షల 76వేలు ఆదాయం పెరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.చంద్రుడు తెలిపారు.శని వారం స్థానిక శ్రీ, లక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ.ఓ.చంద్రుడు,అధ్వర్యంలో మండల ఎస్.ఐ. సురేష్, తమ పోలీస్ బందోబస్తు మధ్య ఆలయాల మాన్యం భూములకు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.ఓ. బి.చంద్రుడు, మాట్లాడుతూ శ్రీ" గౌరీ బోగేశ్వర స్వామి కి సంబందించి 46.00 ఎకరాలు శ్రీ"లక్ష్మి చెన్న కేశవ దేవాలయం కు సంబంధించి 44.14 ఎకరాలు మొత్తం కలిపి 90.14 ఎకరాల ఆలయ భూములకు కౌలు హక్కుకు వేలం పాట నిర్వహించగా 33 మంది వేలం పాటలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.ఈ వేలం పాటలో సుమారు రూ.20.14 లక్షలు రాగా గత ఏడాది వేలం పాటలో కేవలం రూ.16.38 లక్షలు మాత్రమే వచ్చిందన్నారు...ఈ ఏడాది గతం లో కంటే సుమారు రూ.3.76 లక్షల ఆదాయం పెరిగిందని అయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు గ్రామ పెద్దలు లింగుట్ల వెంకట నాయుడు, నారాయణ స్వామి,గోపాల్ నాయుడు,పోలీస్ సిబ్బంది,సంబంధిత ఆలయ సిబ్బంది, రైతులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భార్యాభర్తల పై దాడి కేసు నమోదు.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో భార్యాభర్తల పై దాడి చేయడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన బయమ్మ అనే మహిళను ఇంటిదగ్గర కోడి పిల్లను కుక్క కరచి చంపి వేయడంతో తిట్టుకుంటూ ఉండటంతో తమనే తిడుతోందని భావించిఅదే గ్రామానికి చెందిన భాష రహీం ,రఫీ ,బావయ్య, అనేవారు దాడి చేసి గాయపరచారన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్మి వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమములు.

6 July 2024 at 10:25 am

పూజలు నిర్వహిస్తున్న భక్తులు.నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:- మండల కేంద్రంలో గల శ్రీ కాశీ విశ్వేశ్వర ఆంజనేయ స్వామి మరియు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వార్లకు శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మరియు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి భక్తులకు అర్చన కార్యక్రమం నిర్వహించి అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల చేత పూజారి గోవింద నామ స్మరణ చేయించారు. రుద్రవరం మండల పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి నరహరి, ఆలయ కమిటీ లింగం సత్యనారాయణ,నూకల కృష్ణమూర్తి, టంగుటూరి మురళీ కృష్ణ,పెరుమాళ్ళ వెంకట సురేంద్ర, జుటూరి యశ్వంత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిఎంల భేటీ మంచి పరిణామం

ఎపి మంత్రి సత్యకుమార్ వెల్లడి

విజయవాడ,,జూలై6 : ముఖ్యమంత్రుల భేటీపై ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల సీఎంల భేటి శుభ పరిణామమని అన్నారు. విభజన చట్టంలోని అంశాలు నీటి సమస్యలపై స్నేహపూర్వకంగా చర్చలు జరగాలన్నారు. రాజకీయాలకు తావు లేకుండా సమస్యల పరిష్కారానికి సీఎంలు ముందుకు రావడం అభినందనీయ మన్నారు. రెండు ప్రాంతాల మధ్య వైశమ్యాలు పెంచుతూ కేసీఆర్ అధికారంలోకి వచ్చారని విమర్శించారు. కేసీఆర్ విద్వేషపూరితమైన వాతావరణాన్ని నెలకొల్పారని మండిపడ్డారు. ఇప్పటి వరకు రాజకీయ లబ్ది కోసం ప్రయత్నించారన్నారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757